TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

## విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9440555990

సంపుటి : 01 సంచిక : 298 | శనివారం జులై 05 2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

# రైతు సంక్షేమంపై చర్చిద్దాం రండి



**ఢిల్లీలో ఉండే మోడి...గల్లీలో ఉండే కెడీ అయినా చర్చకు సిద్ధం**

- కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- ఏడాదిలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం
- ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత తమదే
- ఎల్బీ స్టేడియం సామాజిక సదస్సులో సిఎం రేవంత్

హైదరాబాద్,జులై 4
ఢిల్లీలో ఉండే మోడీ అయినా, గల్లీలోని కేడీ అయినా.. రైతు సంక్షేమం విషయంలో తేల్చుకునేందుకు రండి, సవాళ్లకు సిద్ధమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలకు గట్టి సవాల్ విసిరారు. కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసి, వ్యవసాయాన్ని దండుగ నుంచి పండుగగా మార్చిన ఘనత తమదంటూ రేవంత్ రెడ్డి గర్వంగా వెల్లడించారు. 24 గంటల ఉచిత కరెంట్, రుణమాఫీ సహా రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి తెలంగాణ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసినట్లు తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు ఏడాదిలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని అన్నారు. ఇది కాదని నిరూపించ గలరా అని సవాల్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ నేపథ్యంలో రైతుల శ్రేయస్సు కోసం చేసిన పనులపై బహిరంగ చర్చకు రావాలని బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు రేవంత్ సవాల్ చేశారు. రైతుల బాగు కోసం ఎవరు ఎంత చేశారో తేల్చుకునేందుకు రావాలని కోరారు. రైతుల కోసం 18 నెలల్లో రూ.1.04లక్షల కోట్లు ఖర్చు చేశాం. వరి వేస్తే ఉరి వేసుకున్నట్టేనని గత సీఎం చెప్పారు.. 2.80 కోట్ల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండించి దేశానికే ఆదర్శంగా నిలిచాం. రైతుభరోసాలో ప్రభుత్వం విఫలమవుతుందని కొందరు ఎదురు చూశారు.. కానీ వారి ఆశ నెరవేరలేదు. రైతు రాజ్యం ఎవరు తెచ్చారో.. ఎక్కడైనా చర్చ చేసేందుకు సిద్ధం. చర్చకు ఎవరొస్తారో రండి.. కేసీఆర్, మోదీ, కిషన్‌రెడ్డి.. ఇలా ఎవరొచ్చినా సరే. కేసీఆర్‌ను ప్రశ్నిస్తున్నా.. పేదలు ఎప్పుడూ బర్రెలు, గొర్రెలు మేపుతూనే బతకాలా?కేసీఆర్, మోదీకి సవాల్ విసురుతున్నా. లెక్క కావాలంటే చెప్పండి.. అందర్నీ తీసుకొచ్చి స్టేడియంలో నిలబెట్టి లెక్కవేయిస్తా. 60వేలకు ఒక్కరు తక్కువ వచ్చినా కాళ్లు మొక్కి తప్పుకొంటా' అని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంస్కరణలు, పథకాలను అమలు చేస్తోందన్నారు. అనేక కష్టాలు ఎదురైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం నిలబడి, సమస్యలను అధిగమించి, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించే దిశగా పనిచేస్తోందన్నారు. ఈ క్రమంలో తెలంగాణ రైతులు ఈ ఏడాది 2 కోట్ల మెట్రిక్ టన్నుల రైస్‌ను ఉత్పత్తి చేసినట్లు సీఎం గుర్తు చేశారు. ప్రజా పాలనలో ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైతులకు సరైన ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.

మిగతాద్ది 2 లో

## సామాజిక న్యాయానికి తూట్లు పొడిచేందుకే కాంగ్రెస్ సభ: రామచందర్‌రావు




హైదరాబాద్:
సామాజిక న్యాయానికి తూట్లు పొడిచేందుకే కాంగ్రెస్ సభ నిర్వహిస్తోందని తెలంగాణ భాజపా అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు 'ఎక్స్' వేదికగా విమర్శించారు. కాంగ్రెస్ దోపిడీకి తెలంగాణ అక్షయ పాత్రగా మారిందని వ్యాఖ్యానించారు. గ్యారెంటీలు, హామీల పేరుతో హడావుడి తప్ప అమలులో మాత్రం శూన్యమని విమర్శించారు. బీసీలకు తీవ్ర అన్యాయం చేసి.. ఎస్సీ, ఎస్టీలకు సంకెళ్లు వేసి భీమ్ పేరుతో నాటకమాడుతోందన్నారు. ఎమర్జెన్సీతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాలకు తూట్లు పొడిచి.. న్యాయాన్ని, రాజ్యాంగ విలువలను కాంగ్రెస్ ఖూనీ చేసిందని ధ్వజమెత్తారు.

## మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యంపై స్పందించిన కేటీఆర్



హైదరాబాద్:
బీఆర్ఎస్ అధినేత,మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన తనయుడు కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. కేసీఆర్ ఆరోగ్యం బాగుందని చెప్పారు. బ్లడ్ షుగర్, సోడియం లెవల్స్ సాధారణ వైద్య పరీక్షల్లో భాగంగా నిన్న సాయంత్రం ఆయన సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చేరారని తెలిపారు. వైద్యుల పర్యవేక్షణలో కేసీఆర్ కొన్ని రోజులు ఆస్పత్రిలో ఉండనున్నారని చెప్పారు. కేసీఆర్ ఆరోగ్యం గురించి ఆరాతీస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## హైదరాబాద్‌కు మోదీ చేసింది శూన్యం - ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే




2 లో

హైదరాబాద్:
తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కారణం కార్యకర్తలేనని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. ఇలా అందరూ కలిసికట్టుగా భారత రాష్ట్ర సమితిని ఓడించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని చెప్పారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన 'కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి' సభలో ఖర్గే మాట్లాడారు.

**ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం**

"గతంలో రైతులు, మహిళలు, నిరుద్యోగులను కేసీఆర్ మోసం చేశారు. ప్రధాని మోదీ, అమిత్‌షా అబద్ధాలు చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. హైదరాబాద్‌కు మోదీ చేసింది శూన్యం.



2 లో

## హనుమాన్ స్ఫూర్తిగా 'ఆపరేషన్ సిందూర్': రాజ్‌నాథ్‌సింగ్

హైదరాబాద్:
హనుమాన్ స్ఫూర్తిగా 'ఆపరేషన్ సిందూర్' కొనసాగిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పాకిస్థాన్‌తో పాటు ప్రపంచానికి మనం బలమేంటో చూపించామన్నారు. పాక్ ఉగ్ర స్థావరాలను టార్గెట్ చేశాం తప్ప.. పౌరులను కాదని చెప్పారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో క్షత్రియ సేవా సమితి (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్), భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో రాజ్‌నాథ్ మాట్లాడారు.

## 90 సీట్లతో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్:
సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు.. చేసిన అభివృద్ధితో పార్టీ మరోసారి 90 సీట్లతో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ.. సామాజిక న్యాయానికి కట్టుబడి అగ్రవర్ణాలకు చెందిన రేవంత్‌రెడ్డికి సీఎం, బీసీనైన తనకు పీసీసీ చీఫ్, నలుగురు దళితులకు క్యాబినెట్‌లో చోటు కల్పించిందని మహేశ్‌కుమార్ అన్నారు. మరో దళిత బిడ్డకు స్పీకర్ పదవి ఇచ్చి గౌరవించిందని చెప్పారు. కొత్తగా నియమితులైన నేతలకు పార్టీ చక్కని అవకాశం కల్పించిందని, దానిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభలో గ్రామస్థాయి అధ్యక్షులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిశానిర్దేశం చేస్తారని తెలిపారు.

## వైద్య ఆరోగ్యశాఖలో 2,363 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ ఆమోదం

హైదరాబాద్:
తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలో పెద్ద సంఖ్యలో పోస్టుల భర్తీకి అనుమతి లభించింది. దాదాపు 2,363 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఒప్పంద, పొరుగుసేవల కింద ఈ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది.

## రేవంత్.. నిరుద్యోగుల నిర్బంధం, అరెస్ట్ దుర్మార్గం: కేటీఆర్



మిగతాది 2లో

హైదరాబాద్:
ఇందిరమ్మ రాజ్యంలో సచివాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఊదరగొట్టిన సీఎం రేవంత్‌కు నిరుద్యోగుల కష్టాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చలో సచివాలయం కార్యక్రమాన్ని చేపట్టిన నిరుద్యోగులను అక్రమంగా అరెస్టుచేసి వారి గొంతులు నొక్కలేరు అంటూ విమర్శించారు.మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కేటీఆర్ ట్విట్టర్ వేదికగా..

## మహబూబ్‌నగర్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు




2 లో

మహబూబ్‌నగర్:
మహబూబ్‌నగర్‌లో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. నగరంలోని బోయపల్లి గేట్ వద్ద 6వ నంబర్ బోగి పట్టాలు తప్పినట్లు లోకో పైలట్ గుర్తించి రైలును నిలిపివేశారు. సుమారు 20 మీటర్ల మేర స్లీపర్ (సిమెంటు పట్టాలు)పై రైలు వెళ్లింది. గూడ్స్ రైలు రామగుండం నుంచి తమిళనాడుకు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో మహబూబ్‌నగర్-కర్నూలు మార్గంలో 3 గంటలుగా రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. చెంగల్‌పట్టు, హంద్రీ, మైసూర్, సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచిపోయాయి. పట్టాలు తప్పిన గూడ్స్ రైలు వద్ద మరమ్మతులు చేపట్టేందుకు కాచిగూడ నుంచి యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్‌ను అధికారులు రప్పించారు.

మన వెలుగు
MANA VELUGU TELUGU DAILY
శనివారం జూలై 05 2025

# సంపాదకీయం

## నీళ్లు నమిలిన క్వాడ్!



అమెరికాలో బుధవారం జరిగిన చతుర్భుజ కూటమి (క్వాడ్) దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం అనుకున్న విధంగానే కశ్మీర్‌లోని పెహల్‌గామ్‌లో మొన్న ఏప్రిల్ 22న ఉగ్రవాదులు దాడిచేసి 26 మందిని పొట్టన బెట్టుకున్న ఉదంతాన్ని తీవ్రంగా ఖండించింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనటంలో సహకరించుకోవటానికి సిద్ధంగా ఉన్నామని ఉమ్మడి ప్రకటన తెలియజేసింది.'ఇందుకు కారకులైనవారినీ, దాడిలో పాల్గొన్నవారినీ, వారికి ఆర్థికంగా సహకరించినవారినీ ఎలాంటి జాప్యం లేకుండా శిక్షించటానికి ఐక్యరాజ్యసమితి దేశాలన్నీ తోడ్పడాల'ని సూచించింది. క్వాడ్ వంటి కూటములు ఏర్పడటం వెనకుండే ధ్యేయం సంక్షోభ సమయాల్లో సమష్టిగా అడుగు మందుకేయటం కోసమే.కానీ ఉగ్రవాదులు పాకిస్తాన్ నుంచి వచ్చినట్టు స్పష్టంగా తెలుస్తున్నా ఆ దేశాన్ని వేలెత్తి చూపటానికీ, అటువంటి కార్యకలాపాలు మానుకోవాలని హెచ్చరించటానికీ కూటమిలోని మిగతా మూడు దేశాలూ సిద్ధంగా లేవంటే క్వాడ్ ఆవిర్భావానికి గల ప్రాతిపదికే ప్రశ్నార్థకంగా మిగిలినట్టు లెక్క. పెహల్‌గామ్ ఘటన అనంతరం మన దేశం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై దాడిచేసింది.దానికి ప్రతిగా పాకిస్తాన్ సైన్యం మనపై క్షిపణులతో, డ్రోన్‌లతో దాడికి దిగాక మన దళాలు వాటిని తిప్పికొట్టడంతోపాటు అక్కడి వైమానిక స్థావరాలను ధ్వంసం చేశాయి. ఇరు దేశాల మధ్యా ఇది పూర్తి స్థాయి యుద్ధంగా పరిణమించే సూచనలు కనబడ్డాయి. కారణాలేమైతేనేం...నాలుగు రోజుల అనంతరం కాల్పుల విరమణకు ఇరు దేశాలూ అంగీకరించాయి.ప్రపంచ దేశాలన్నీ ఈ పరిణామాలను ఎంతో ఆందోళనతో గమనించాయి. కానీ ఉమ్మడి ప్రకటన పాక్ పేరెత్తి ఖండించకుండా మర్యాదపూర్వకంగా, లౌక్యంగా మాట్లాడితే ఒరిగేదేమిటి? క్వాడ్ ఈనాటిది కాదు. పద్దెనిమిదేళ్ల క్రితం జపాన్ ద్వారా మన దేశాన్ని ఒప్పించి ఈ కూటమి ఏర్పాటుకు నాంది పలికింది అమెరికాయే. 2007లో కూటమి ఏర్పాటుపై చర్చించటానికి నాలుగు దేశాలూ సమావేశమైనప్పుడే చైనా ఉరిమింది.తనకు వ్యతిరేకంగానే ఈ కూటమి ఏర్పడుతున్నదంటూ నిష్టూరానికి పోయింది. ఏడాది గడవకముందే జపాన్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడి కూటమి నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించింది. 2008లో ప్రభుత్వం మారి ఆస్ట్రేలియా సైతం నిష్క్రమిస్తున్నట్టు తెలియజేసింది.ఇలాంటి పరిస్థితుల్లో 2017లో తిరిగి క్వాడ్‌కు జీవం పోసింది అప్పటి ట్రంప్ ప్రభుత్వమే. అప్పటికల్లా దక్షిణ చైనా, తూర్పు చైనా సముద్ర జలాల్లో చైనా కార్యకలాపాలు పెరిగాయి. 'అన్నీ నేనే... అంతా నాదే' అంటూ పగడాల దిబ్బలు, ఇసుక మేటలు చైనా తన ఖాతాలో వేసుకుంది. అంతటితో ఊరుకోక స్ప్రాట్లీ దీవుల చుట్టూ ఏడు కృత్రిమ దీవుల నిర్మాణం ప్రారంభించింది. ఇది జపాన్‌తో పాటు ఆస్ట్రేలియానూ... ఆ రెండు దేశాలకూ అన్ని విధాలా అండగా ఉంటున్న అమెరికానూ చికాకు పెట్టిన పర్యవసానంగానే క్వాడ్ మళ్లీ పురుడు పోసుకుంది. సారాంశంలో ఇది అమెరికా, చైనాల మధ్య జరిగే ఆధిపత్య పోరులో భాగంగా వచ్చింది. అందులో మనల్ని భాగస్వాముల్ని చేసి తన వివాదాన్ని మనకు కూడా అంటించిన అమెరికా మనకు సమస్య వచ్చినప్పుడు మాత్రం మనవైపుండదని పెహల్‌గామ్ రుజువు చేసింది.మరి ఇలాంటి కూటములు పెట్టి ప్రయోజనమేమిటి? విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి కన్వల్ సిబల్ అన్నట్టు పాకిస్తాన్‌తో మిగిలిన మూడు సభ్య దేశాలకూ, ముఖ్యంగా అమెరికాకూ స్నేహ సంబంధాలుండటం వల్ల ఉమ్మడి ప్రకటనలో నేరుగా దాన్ని ప్రస్తావించటానికి మొహమాటపడి ఉండొచ్చు. మరి అదే పరిస్థితి మనకు ఉండదా? మనకూ, పాకిస్తాన్‌కూ వున్న వైషమ్యాలపై క్వాడ్ పెట్టేనాటికే మిగిలిన మూడు దేశాలకూ అవగాహన ఉండాలి. మరి ఎందుకు కలుపుకొన్నట్టు? ఇలాంటి పరిస్థితి తలెత్తగలదని ఆనాడు తెలియదా భూగోళంలో ఏమూల ఉగ్రవాదం ఉన్నా దాన్ని నిర్మూలించేదాకా వదలబోమని, దానిపట్ల దయాదాక్షిణ్యాలుండబోవని 2001లో తాను చేసిన శపథం అమెరికాకు గుర్తుందా? క్వాడ్ కూటమి సమావేశానికి ముందు మన విదేశాంగ మంత్రి జైశంకర్ మూడు దేశాల విదేశాంగ మంత్రులతో విడివిడిగా భేటీ అయ్యారు. పెహల్‌గామ్, తదనంతర పరిణామాలపై వారితో చర్చించారు.ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్ తీరును వివరించారు. బహుశా దాని పర్యవసానంగా కనీసం పెహల్‌గామ్‌ను ప్రకటనలో ప్రస్తావించి చర్య తీసుకోవాలన్న డిమాండైనా చేశారు. లేకుంటే దానికి కూడా దిక్కు లేకపోయేదేమో! పాకిస్తాన్ ఎన్ని తప్పుడు పనులకు పాల్పడుతున్నా అమెరికాకు ఆ దేశమంటే మోజు.'రెండు దేశాలనూ బెదిరించి యుద్ధం ఆపాన'ని గొప్పలు పోయిన ట్రంప్, ఆ తర్వాత వారం గడవకుండా ఆ దేశ ఆర్మీ చీఫ్‌తో భేటీ అయి పొగడ్తలతో ముంచెత్తారు. చైనాతో మనకు సరిహద్దు వివాదాలున్న సంగతి నిజమే. ఆ విషయంలో మన దేశం రాజీ పడకుండా చర్చలు సాగిస్తోంది.దురాక్రమణకు ప్రయత్నించినప్పుడల్లా ఎదుర్కొంటున్నది. క్వాడ్ ఉనికిలోకి రాకముందునుంచీ అది కొనసాగుతోంది. పరస్పరం సహకరించుకోవటానికీ, ఎదగటానికీ కూటములు అవసరం. అధునాతన సాంకేతికతల్లో తోడ్పడే అత్యంత కీలకమైన ఖనిజాల, ఇతర వనరుల సరఫరాపై చైనా ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఎవరిపైనా ఆధారపడకుండా ఎదిగేందుకు, సరఫరాలకు అంతరాయం ఏర్పడకుండా చూసేందుకూ సమష్టిగా కృషి చేయాలని క్వాడ్ తీర్మానించటం హర్షించదగ్గదే.ఈ ఏడాది చివరిలో క్వాడ్ దేశాధినేతల శిఖరాగ్ర సదస్సు మన దేశంలో జరుగుతున్న నేపథ్యంలో కూటమి భాగస్వాముల్లో మరింత సదవగాహన, సమన్వయం అవసరమని... కీలక సమయాల్లో నిర్మొహమాటంగా ఉండటం ముఖ్యమని తెలుసుకుంటే మంచిది.

# హైదరాబాద్‌కు మోదీ చేసింది శూన్యం

## – ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

మొదటిపేజీ తరువాయి

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం అందిస్తోంది. రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో రూ.8,200 కోట్లు జమ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తోంది. గిగ్ వర్కర్ల హక్కుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొస్తోంది. దేశంలో తొలిసారి కులగణన చేపట్టింది తెలంగాణ ప్రభుత్వమే. బీసీల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోంది.

**ఆ విషయంపై మోదీ ఎందుకు నోరు విప్పరు?**

దేశ ఆర్థిక పరిస్థితిని ప్రధాని మోదీ చిన్నాభిన్నం చేశారు. పాకిస్థాన్‌తో యుద్ధం చేయాలని 'ఆపరేషన్ సిందూర్'కు రాహుల్‌గాంధీతో పాటు కాంగ్రెస్ కూడా సంపూర్ణ మద్దతు ఇచ్చింది. మరి మోదీ ఎందుకు యుద్ధాన్ని మధ్యలోనే ఆపేశారు? అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేయగానే యుద్ధం ఆపేశారు.. కానీ ఆ విషయంపై ప్రధాని నోరు విప్పరు. గతంలో అమెరికా బెదిరించినా ఇందిరాగాంధీ భయపడలేదు. దేశం కోసం ఇందిర, రాజీవ్‌గాంధీ ప్రాణాలు అర్పించారు. భాజపా, ఆర్ఎస్ఎస్ నుంచి ఒక్కరైనా ప్రాణాలు అర్పించారా?

**మణిపూర్ ఈ దేశంలో భాగం కాదా?**

ఇప్పటి వరకు ప్రధాని 42 దేశాలు తిరిగారు.. కానీ మణిపూర్ వెళ్లడానికి మాత్రం మనసు రాలేదు. ఆ రాష్ట్ర అంశంపై ఒక్కసారి కూడా ఆయన పెదవి విప్పలేదు. రాహుల్‌గాంధీ, నేను మణిపూర్ వెళ్లాం.. మోదీ మాత్రం వెళ్లలేదు. మణిపూర్ ఈ దేశంలో భాగం కాదా? మణిపూర్ వాసులు భారతీయులు కాదా?సెక్యులర్, సోషలిస్టు పదాలను ఆర్ఎస్ఎస్, భాజపా, మోదీ, అమిత్‌షా సహా ఎవరూ రాజ్యాంగం నుంచి తొలగించలేరు. మోదీజీ.. ముందు దేశ ప్రజల బాధలు వినండి.. ఆ తర్వాత విదేశాల సంగతి చూడొచ్చు. అఖిలపక్ష సమావేశానికి ప్రధాని రాలేదు.. బిహార్ ఎన్నికల ప్రచారంలో ఆయన బిజీగా ఉన్నారు" అని ఖర్గే విమర్శించారు.

# రైతు సంక్షేమంపై చర్చిద్దాం రండి

మొదటిపేజీ తరువాయి

కేవలం 9 రోజుల వ్యవధిలో రూ. 9 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో రైతులకు ఆర్థిక భరోసాను అందించడమే కాకుండా, వ్యవసాయాన్ని ఒక పండుగగా మార్చిందని రేవంత్ రెడ్డి తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ సరఫరా చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయం, రైతు సంక్షేమం, ఆర్థిక పునరుద్ధరణ కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూడు రంగుల జెండా చేతబూని కల్వకుంట్ల గడీని బద్దలు కొట్టామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతి గుండెను తడుతూ ప్రజాపాలన సాగిస్తున్నామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరగబోతున్నాయని.. మహిళలకు రిజర్వేషన్లు అమలు కానున్నాయని చెప్పారు. కార్యకర్తలకు అన్ని పదవులు దక్కే వరకూ విశ్రాంతి తీసుకోబోనని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో 100 అసెంబ్లీ సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని.. దాని కంటే ఒక్క సీటు తక్కువ వచ్చినా తనదే బాధ్యతని చెప్పారు. 'కాంగ్రెస్ నేతలు కలిసి ఉండలేరని.. ఈ పాలన మూణ్నాళ్ల ముచ్చటే అని కొందరు అన్నారు. కానీ.. పార్టీ నేతలంతా ఐకమత్యంతో పనిచేస్తూ ఆ అపోహలను పటాపంచలు చేశారు. జనగణనతో పాటు కులగణన.. ఎస్సీ వర్గీకరణ చేస్తామని గతంలో రాహుల్‌గాంధీ మాటిచ్చారు. హామీ ఇచ్చినట్టుగానే ఏడాదిలోపే కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసి చూపించాం. 18 నెలల్లో దేశానికే ఆదర్శంగా నిలిచేలా తెలంగాణ మోడల్ ఆవిష్కరించాం. కష్టాలు, ఒడిదొడుకులు వచ్చాయి.. అన్నీ అధిగమించి ముందుకెళ్తున్నాం. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీంతోపాటు అనేక మంది కాంగ్రెస్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రేవంత్.. నిరుద్యోగుల నిర్బంధం, అరెస్ట్ దుర్మార్గం: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

'ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని రాహుల్ గాంధీ చేసిన ద్రోహంపై నిలదీసేందుకు వచ్చిన నిరుద్యోగులను అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య. ఇందిరమ్మ రాజ్యంలో సచివాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఊదరగొట్టిన సీఎం రేవంత్ కు నిరుద్యోగుల కష్టాలు కనిపించడం లేదా?. అశోక్ నగర్ చౌరస్తాలో రాహుల్ గాంధీని పిలిపించి మరీ నిరుద్యోగులతో చాయ్ పే చర్చ పెట్టిన రేవంత్‌కు గద్దెనెక్కిన తరువాత జాబ్ క్యాలెండర్ అసలు గుర్తే లేదా?.
చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు తెలంగాణ వ్యాప్తంగా అనేక జిల్లాల్లో నిరుద్యోగులు హైదరాబాద్ రాకుండా ముందుగానే నిర్బంధించడమే దారుణమైతే, ఇవాళ సచివాలయానికి గోడు చెప్పుకునేందుకు వచ్చిన వారిని కూడా అరెస్టు చేయడం దుర్మార్గం. యూత్ డిక్లరేషన్ పేరిట ఢిల్లీ పెద్దలను పిలిపించి మరీ మోసం చేసిన రేవంత్ ఏడాదిన్నర కాలంలో పట్టుమని పదివేల ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వకపోవడం నిరుద్యోగులకు వెన్నుపోటు పొడవడమే. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రక్రియ పూర్తి చేసిన 60వేల ఉద్యోగాలకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి చేతులు దులుపుకున్న చేతకాని ముఖ్యమంత్రిని నిరుద్యోగులు ఎప్పటికీ క్షమించరు. ఓవైపు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలు ఇంకెప్పుడు అని నిరుద్యోగులు ఎదురుచూస్తుంటే.. మరోవైపు నిరుద్యోగులు నోటిఫికేషన్లే వద్దంటున్నారని బుకాయించడం కాంగ్రెస్ సర్కారు దిగజారుడుతనానికి నిదర్శనం.ఏడాదిలోనే జాబ్ క్యాలెండర్‌లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని మాటిచ్చి మోసం చేసిన ముఖ్యమంత్రికి నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయం. చలో సచివాలయం కార్యక్రమాన్ని చేపట్టిన నిరుద్యోగులను అక్రమంగా అరెస్టుచేసి వారి గొంతులు నొక్కలేరు. వెంటనే వారందరినీ బేషరతుగా విడుదల చేసి ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను ఇప్పటికైనా నిలబెట్టుకోవాలి. లేకపోతే రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించి రేవంత్ సర్కారు మెడలు వంచుతాం.. కాంగ్రెస్ సర్కారు చేసిన ద్రోహాన్ని గడపగడపకూ తీసుకెళ్లి ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని దోషిగా నిలబెడతాం.. జై తెలంగాణ అని వ్యాఖ్యలు చేశారు.

# రోడ్డు దాటుతుండగా దూసుకొచ్చిన బస్సు

## క్లీనర్ అప్రమత్తతో స్కూల్ పిల్లలకు తప్పిన ముప్పు

కృష్ణా జిల్లాలోని జగ్గయ్యపేటలో స్కూల్ విద్యార్థులకు భారీ ప్రమాదం తప్పింది. ప్రతీ రోజులాగే ఈరోజు కూడా విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు బస్సు ఎక్కారు. స్కూల్ వద్దకు వాహనం చేరుకున్న వెంటనే వారంతా ఒకరి తరువాత ఒకరు దిగి లోపలికి వెళ్తున్నారు. ఇదే సమయంలో జరిగిన ఓ ఘటన అక్కడి వారిని భయాందోళనకు గురిచేసింది. అయితే వాహనం డ్రైవర్, క్లీనర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పిల్లలకు పెను ప్రమాదం తప్పినట్లైంది. చిన్నారులంతా క్షేమంగా ఉండటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. శుక్రవారం ఉదయం కేసీపీ క్వార్టర్స్ నుంచి విద్యార్థులను పాఠశాలల్లో దింపేందుకు కంపెనీ వాహనం క్వార్టర్స్ వద్దకు వెళ్లింది. పిల్లలు అందరూ ఎక్కిన తర్వాత బస్సు బయలుదేరింది. ఆ తరువాత బజాజ్ షోరూం సమీపంలో వాహనాన్ని ఆపి స్కూల్లోకి పిల్లలను పంపించేందుకు బస్సు నుంచి డ్రైవర్, క్లీనర్ కిందకు దిగారు. అయితే వారు రోడ్డు క్రాస్ చేసి వస్తున్న సమయంలో కోదాడ రోడ్డు వైపు నుంచి ఓ ప్రైవేటు స్కూల్ బస్సు అతివేగంగా దూసుకొచ్చింది. తన బస్సుకు బ్రేక్ ఫెయిల్ అయ్యిందంటూ డ్రైవర్ గట్టి గట్టిగా అరిచాడు. పిల్లల మీదకు రాబోతున్న బస్సును వెంటనే గమనించిన డ్రైవర్, క్లీనర్ సమయస్ఫూర్తితో చిన్నారులను అక్కడి నుంచి తప్పించేశారు. దీంతో పిల్లలంతా క్షేమంగా బయటపడ్డారు.

# హనుమాన్ స్ఫూర్తిగా 'ఆపరేషన్ సిందూర్': రాజ్‌నాథ్‌సింగ్

మొదటిపేజీ తరువాయి

గిరిజనుల కోసం అల్లూరి సీతారామరాజు అనేక పోరాటాలు చేశారని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. గెరిల్లా యుద్ధ నైపుణ్యాలతో బ్రిటిష్ వారితో ఆయన పోరాడారని గుర్తుచేశారు. "భారత్ కోసం అల్లూరి సీతారామరాజు లాంటి గొప్ప వీరుడిని ఆంధ్రప్రదేశ్ ఇచ్చింది. అడవి నుంచి విప్లవం పుట్టించి బ్రిటిష్ వారిని గజగజలాడించిన వ్యక్తి అల్లూరి. గెరిల్లా యుద్ధ నైపుణ్యాలతో ఆధునిక ఆయుధాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి ఆయన. బానిసత్వంతో కాదు ఆత్మాభిమానంతో బతకాలనేది ఆయన నుంచి మనం నేర్చుకోవాలి. అడవి బిడ్డల కోసం అల్లూరి వీరోచిత పోరాటం చేశారు. ఆయన పుట్టిన గ్రామాన్ని పర్యటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నాం" అని రాజ్‌నాథ్ అన్నారు.

**చాలామంది సమరయోధులకు చరిత్రలో సరైన స్థానం దక్కలేదు: కిషన్‌రెడ్డి**

గిరిజన ప్రాంతాల్లో జన్మించిన అనేక మంది స్వాతంత్ర్య సమరయోధులకు చరిత్ర పుటల్లో సరైన స్థానం దక్కలేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆ చరిత్రను సమాజానికి అందించాలనేదే ప్రధాని మోదీ ఉద్దేశమని చెప్పారు. దీనిలో భాగంగానే అల్లూరి సీతారామరాజు చరిత్ర అందరికీ తెలిసేలా 125వ జయంతిని నిర్వహించినట్లు వివరించారు. అల్లూరి నడయాడిన ప్రదేశాలను గుర్తించి కేంద్ర పభుత్వ సహకారంతో పర్యటక కేంద్రాలుగా అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక, పర్యటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, క్షత్రియ సేవాసమితి అధ్యక్షులు సత్యనారాయణరాజు, కార్యదర్శి కె.రఘురామరాజు పాల్గొన్నారు.

# రోశయ్య అరుదైన రాజకీయ వేత్త

**– బడ్జెట్ సర్దుబాటులో ఆయనది అందెవేసిన చేయి**
**– 16సార్లు బడ్జెట్ సమర్పించిన ఘనత రోశయ్యది**
**– రోశయ్య జయంతి వేడుకల్లో స్పీకర్ ప్రసాద్ కుమార్**

దేశంలో ఒక రాష్ట్ర ఆర్థికమంత్రిగా అత్యధికంగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యదని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. అప్పులు చేయకుండా ఉన్నంతలో బ్జడెట్ ను సర్దుబాటు చేయడంలో రోశయ్యది అందెవేసిన చెయ్యని అన్నారు. ముగ్గురు ముఖ్యమంత్రుల పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధుల కొరత లేకుండా సర్దుబాటు చేసిన ఘనత రోశయ్య గారిదని అన్నారు. నిండైన తెలుగు తనానికి ప్రతిరూపం రోశయ్య అని,. పంచెకట్టు, భుజంపై పై పంచెతో ఆకట్టుకునే ఆహార్యం రోశయ్యదని అన్నారు. స్వర్గీయ కొణిజేటి రోశయ్య 92వ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆద్వర్యంలో రవీంద్రభారతిలో జరిగిన సభలో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, నాయకులు, వైశ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సభా వేదికపై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుని ప్రముఖులు సన్మానించారు. .ఈసందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... స్వర్గీయ కొణిజేటి రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషం. గొప్ప రాజకీయ నేతకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. ఇలాంటి మంచి నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రి వర్గ సభ్యులకు నా అభినందనలు తెలుపుతున్నానని అన్నారు అదేవిధంగా ఈరోజు వారి విగ్రహాన్ని నెలకొల్పి ఆవిష్కరించడం ద్వారా రోశయ్య గారి గొప్పతనాన్ని భవిష్యత్తు తరాలకు వారి తెలియజేయడం జరిగిందన్నారు. ఇక వాక్పటిమ, వాగ్దాటి, చతురతలో రోశయ్య గారితో ఇంకొకరిని పోల్చలేం. కాంగ్రెస్ ప్రభుత్వంలో గవర్నర్ గా నియామకం అయ్యి బిజేపి ప్రభుత్వంలో కూడా కొనసాగిన అరుదైన వ్యక్తులలో రోశయ్య గారు ఒకరు. రాజకీయ విభేదాలు ఉండవచ్చు కానీ వ్యక్తిగతంగా అందరికీ ఆజాత శత్రువు రోశయ్య గారని అన్నారు. రోశయ్య గారిది మన తెలంగాణ ప్రాంతం కాకపోయినా వారిని మనం గౌరవించడానికి కారణం మన భారతీయ సంస్కృతి, సాంప్రదాయం ప్రకారం వారి పెద్దరికానికి గౌరవం ఇవ్వడమేనని అన్నారు. రోశయ్య గారు శాసనసభలో మాట్లాడుతుంటే స్వపక్షంతో పాటుగా విపక్షాలు కూడా ఏకాగ్రతతో వినేవాళ్ళు. యువ, నూతన శాసన సభ్యులకు రోశయ్య గారి ప్రసంగం ఒక పుస్తకం. 2008 ఉప
ఎన్నికలలో నేను మొదటిసారి శాసనసభ్యునిగా ఎన్నికై అసెంబ్లీకి వచ్చినప్పుడు సమావేశాలో రోశయ్య గారి ప్రసంగాలను ప్రత్యేక్షంగా వినే భాగ్యం కలిగింది, వారి ప్రసంగాలకు నేను అభిమానిని.వారి నుండి నేను ఎన్నో విషయాలను నేర్చుకున్నాను. నేటి యువ రాజకీయ నాయకులు రోశయ్య గారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచిస్తున్నానని గడ్డం ప్రసాద్ అన్నారు.

# రైతుల అవసరాలకు సరిపడా అందుబాటులో ఎరువుల నిల్వలు

**- ఎరువుల గిడ్డంగి ఆకస్మికంగా తనిఖీ**
**- తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల సందర్శన**
**- మొక్కల నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలని అధికారులకు మందలింపు**
**- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**





నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 04 : జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్ పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎరువుల విషయంలో ఎవరు కూడా ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు.మాక్లూర్ మండలం అమ్రాద్ గ్రామంలోని సహకార సంఘం ఎరువుల గోడౌన్ ను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిడ్డంగిలో రికార్డులలో పేర్కొన్న విధంగా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయా లేవా అని పరిశీలించారు. ఎరువుల కొనుగోలు కోసం వచ్చిన మదనపల్లి గ్రామ రైతు పి.ప్రభాకర్ ను కలెక్టర్ పలుకరించి, సరిపడా ఎరువుల అందుతున్నాయా అని ప్రశ్నించారు. తనకు 12 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, ప్రస్తుత ఖరీఫ్ లో సన్న రకం వరి ధాన్యం సాగు చేస్తున్నానని రైతు తెలిపారు.అవసరానికి సరిపడా పూర్తి స్థాయిలో ఎరువులు లభిస్తున్నాయని, ఎలాంటి కొరత లేదని సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, రైతులు ఎవరు కూడా యూరియా సహా ఇతర ఎరువుల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పూర్తి స్థాయిలో స్టాక్ అందుబాటులో ఉందని, జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో రైతులకు ఎరువులు అందేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లో ఎరువుల కొరత తలెత్తకుండా పర్యవేక్షణ చేస్తున్నామని భరోసా కల్పించారు.

అంతకుముందు కలెక్టర్ మాక్లూర్ తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను సందర్శించారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను ఆయా కేటగిరీల వారీగా విభజిస్తూ, ఆన్లైన్ లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించి, తహసీల్దార్ శేఖర్ కు పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన, ఆమోదం తదితర అంశాల గురించి వాకబు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని నివాస ప్రాంతాల్లో ఫాగింగ్ జరిపించాలని, అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ నర్సింహారెడ్డిని ఆదేశించారు. చిన్నాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 35 ఇళ్లను మంజూరు చేయగా, 16 మార్కింగ్ చేశామని, వాటిలో 4 బేస్మెంట్ లెవెల్ వరకు పూర్తి అయ్యాయని అధికారులు తెలిపారు. మంజూరీ పొందిన లబ్ధిదారులందరూ ఇళ్లను నిర్మించుకునేలా తోడ్పాటును అందించాలని కలెక్టర్ సూచించారు.

కాగా, అమ్రాద్ తండా కాలువ గట్టు మీద వన మహోత్సవంలో భాగంగా గత సంవత్సరం నాటిన మొక్కలను కలెక్టర్ పరిశీలించారు. మొక్కల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పచ్చదనాన్ని పెంపొందిస్తూ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తూ వన మహోత్సవం కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుంటే, క్షేత్ర స్థాయిలో నిర్వహణను సరిగా పట్టించుకోకపోతే ఎలా అని సంబంధిత అధికారులను మందలించారు. నాటిన ప్రతి మొక్క బ్రతికేలా పక్కాగా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

# కలెక్టరేట్లో దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు



నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 04 : జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు నిర్వహించారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి,కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, ఇతర అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, బీసీ కుల సంఘాల నాయకులు వర్ధంతి వేడుకలో పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరం



మెట్ పల్లి (మన వెలుగు) జులై 04 : కోరట్ల నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగ రావు పుట్టినరోజు సందర్భంగా శ్రీ సాయి శ్రీనివాస హాస్పిటల్ చైర్మన్ ఫౌండర్ రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ బెజ్జరపు శ్రీనివాస్ కంటి వైద్య నిపుణులు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకట సాయి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శ్రీనివాస్ కంటి వైద్య నిపుణులు సుమారు 100 మంది రోగులను పైగా పరీక్షించి ఉచితంగా మందులు మరియు రక్త పరీక్షలు నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజ్మెంట్ అవుట్ల లక్ష్మణ్, అర్ ఎంపీ కంబ సురేష్,వంశీ, ప్రశాంత్,సుమంత్ నితిన్, సాగర్ హాస్పిటల్ స్టాప్ పాల్గొన్నారు

# రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే తగిన గుణపాఠం తప్పదు

**- అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి ప్రభాకర్**






నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 04 : అఖిల భారత ఐక్య రైతు సంఘంఏఐయుకేఎస్ నిజామాబాద్ రూరల్, కామారెడ్డి జిల్లా సంయుక్త జిల్లాల ప్రథమ మహాసభ స్థానిక మోర్తాడ్ మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది.

మహాసభ ప్రారంభానికి ముందుగా సంఘం జిల్లా అధ్యక్షుడు సారా సురేష్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం అమరవీరుల సంతాప తీర్మానం ఆమోదించి అమరవీరులకు నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి ప్రభాకర్ మాట్లాడుతూ స్వాతంత్ర భారతదేశంలో ఆకలి తీర్చే అన్నదాతల ఆకలికేకలు నేటి పాలకుల అసమర్ధతకు నిదర్శనం అన్నారు. రైతు పండించిన పంటల కొనుగోలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయలేని స్థితిలో మొద్దు నిద్రలో నేటి పాలకులు ఉన్నారన్నారు.నాడు దిగుమతుల మీద ఆధారపడకుండా మన ఎగుమతులు మనం చేయాలని స్వాతంత్ర పోరాటంలో మనవి మనమే తయారు చేసుకునే పోరాట తత్వాన్ని మన రైతాంగం అవలంభించింది కానీ నేడు రైతును అవమాన పరిచే స్థితికి నేటి పాలకులు దిగజార్చారు.ఎరువుల మీద సబ్సిడీ లేదు,అట్టేసరూ ఎరువులతో అడ్డగోలు దోపిడి చేస్తున్నారు. నకిలీ విత్తనాలు, పంపిణీ చేసి రైతులను నిలువునా ముంచిన వారిపై కేసులు నమోదు చేసి, చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలం అవుతుంది. రైతు పండించిన పంటకు కనీసం పెట్టుబడి కూడా లేకుండా,మద్దతు ధర రాక,ఆరుగాలం కష్టపడి పండించే రైతు ఆరిగోస పడాల్సిన స్థితికి నెట్టివేస్తున్నార నిదుయ్యబట్టారు మోదీ ప్రభుత్వం గతంతో స్విస్ బ్యాంక్ లో ఉన్నా నల్లదనం ప్రతి ఒక్కరికీ పంపిణీ చేశామని మోసం చేశారు. రైతు ఆత్మహత్యలకు అడ్డు కట్ట వేస్తామని మద్దతు ధర చట్టం చేస్తామని కార్పొరేట్ చుట్టలుగా మారారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.అకాల వర్షాల కారణంగా నీట మునిగినా పంటలకు రైతు బీమా పథకం ఏమైందని వారు ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు పెట్టుబడి సహాయం,రైతు పంటలకు మద్దతు ధర, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు సరిపడా అందించాలని వారు డిమాండ్ చేశారు.ఈ మహాసభ లో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ల రామకృష్ణ, అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవారం, జిల్లా అధ్యక్షులు ఎస్ . సురేష్, ప్రధానకార్యదర్శి గుమ్ముల.గంగాధర్, జిల్లా నాయకులు బి.కిషన్, సహాయ కార్యదర్శి బాబన్న, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు కిషన్, అశోక్,లు జిల్లా నాయకులు జీ.పరమేశ్ ప్రసంగించారు. ఈకార్యక్రమంలోతదితరులు పాల్గొన్నా

# ఐలాపూర్,మాక్లూర్ జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఇంటర్ విద్యా అధికారి





నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 04 : నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్యాఅధికారి తిరుమలపుడి రవికుమార్ శుక్రవారం ఐలాపూర్,మాక్లూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖి చేశారు. కళాశాలలో అధ్యాపకులు, సిబ్బంది హాజరు,విద్యార్థుల హాజరు పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ లు చిన్నయ్య, గంగారామ్ ల అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ఇంటర్ విద్యా అధికారి మాట్లాడుతూ కళాశాలలో మరింత మెరుగుగా అడ్మిషన్ల ప్రక్రియను కొనసాగించా లని సూచించారు. పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల అనంతరం కళాశాలలో అడ్మిషన్ల సంఖ్యను మరింతగా పెంచేందుకుగాను అధ్యాపకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు పదవ తరగతి పాస్ అయిన ప్రతి విద్యార్థిని కళాశాలలో చేర్పించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. అలాగే అధ్యాపకులు సమయ పాలన పాటించాలని ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారినీ ప్రోత్సహిస్తూ కళాశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేట్ల చూడాలని అన్నారు.రెండవ సంవత్సరం విద్యార్థుల తరగతులను ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని అన్నారు.

**కళాశాలలో సిబ్బంది, అధ్యాపకుల పనితీరు పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు.కళాశాల ప్రిన్సిపాల్ లతో పాటు సిబ్బంది అధ్యాపకులు పాల్గొన్నారు.**

# పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 79 వ వర్ధంతి

**- వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు**




నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 04 దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తిగా దున్నే వాడికి భూమి కొరకు పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 79 వ వర్ధంతి సందర్భంగా సిపిఎం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడుతూ. భూస్వాములు ,రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పేదలను కూడగట్టి ప్రదర్శన నిర్వహిస్తున్న సందర్భంలో భూస్వాముల సాయుధ మూక గూండాలు దొడ్డి కొమురయ్య ను కాల్చి చంపడం జరిగిందని. దొడ్డి కొమురయ్య అమరత్వాన్ని స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ రైతంగ సాయుధ పోరాటం ఉవ్వెత్తున ఎగిసిపడి 4000 గ్రామాలలో 10 లక్షల ఎకరాల భూములను భూస్వాముల నుండి పేదలకు పంచటం జరిగిందని అనేక గ్రామాలలో గ్రామ స్వరాజ్యాలను ఏర్పాటు చేసుకొని పరిపాలన కొనసాగించటం జరిగిందని అందువల్ల దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి తెలంగాణలో సాయిధరైతంగా పోరాటానికి మార్గదర్శమైందని నాటి నుండి దున్నేవాడికే భూమి కోసం. జల్ ,జంగల్, జమీన్ నినాదంతో పేదలు పోరాటాల్లోకి ఉవ్వెత్తున కదలడం జరిగిందని ఆయన తెలిపారు. నేటి పాలకులు పేదలకు భూములు పంచాలన్నా ఇంటి స్థలాలు ఇవ్వాలన్న మనసు రాక ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని అదే కార్పొరేట్ కంపెనీలకు పెట్టుబడిదారులకు మాత్రం వేల ఎకరాలను పెడుతున్నారని ఆయన విమర్శించారు దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తిని తీసుకొని భూములను బంజరు భూములను పేదలకు పంచాలని పోరాటాన్ని కుల, మతా లకు అతీతంగా కొనసాగించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు,నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యులు నగర నాయకులు కటారి రాములు మరియు నాయక్ వాడి శ్రీనివాస్, హైమద్, దినేష్, రాజు , పద్మ, తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల పరిశోధన అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి

నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 04 :






గిరిరాజ్ డిగ్రీ కళాశాల లో 'విద్యా రచనలు, ప్రాజెక్టు నివేదికలు గురువారం కళాశాలలో ఒకరోజు కార్యాశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ. కేవలం అవగాహన కల్పించుకోవడమే కాకుండా మెలకువలను నేర్చుకోవాలని సూచించారు.అనంతరం డాక్టర్ జాన్ సుకుమార్ పరిశోధనా పద్ధతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్. సందర్భంగా జాన్ సుకుమార్, శ్యాంకుమారు కళాశాల తరపున సన్మానించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్యాం కుమార్, డాక్టర్ గంగాధర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ దండు స్వామి, వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజేష్, ఎన్సీసీ (ఎన్సిసి) అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ రామస్వామి, గ్రంథపాలకులు పూర్ణచంద్రరావు, సీనియర్ అసిస్టెంట్ ఉదయభాస్కర్, అధ్యాపకులు ప్రతిభ, నాగజ్యోతి, లావణ్య, రాజశేఖర్, దస్తప్ప, నికత్ ఫాతిమా, వసంత్ జాదవ్, స్థిత ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ముఖ్యమంత్రి కే.రోశయ్య జయంతి వేడుకలు



నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 04 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటక మాజీ గవర్నర్ గా వ్యవహరించిన కొణిజేటి రోశయ్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి వేడుకలను జరిపారు. రోశయ్య చిత్రపటానికి కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్,డివైఎస్ఓ పవన్ కుమార్, ఇతర అధికారులు, కలెక్టరేట్ లోని వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సభకు తరలి వెళ్ళిన రూరల్ కాంగ్రెస్ శ్రేణులు



నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జులై 04 : జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో జరిగే కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి రూరల్ నియోజకవర్గం అన్ని మండలాల నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సభకు భారీ ఎత్తున తరలి వెళ్లారు. ఈ సభకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ కార్గే హాజరవుతున్న సందర్భంగా రూరల్ నియోజవర్గం ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశాల మేరకు ప్రతి మండలం నుండి సుమారు 2000 మంది సభకు వెళ్ళినారు. సభకు వెళ్ళిన వారిలో వివిధ మండలాల అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బూత్ స్థాయి సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, భారీ సంఖ్య లో కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు వెళ్ళినారు.

# నేరాల నివారనే లక్ష్యంగా పని చేయండి

**- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**ఇబ్రహీంపట్నం (మన వెలుగు) జులై 04 :**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి వార్షిక తనిఖీ లో భాగంగా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ జిల్లా ఎస్పి అశోక్ కుమార్ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఎస్పి పోలీస్ స్టేషన్ పరిసరాలను, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్బంగా పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులకు క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు అనంతరం సిబ్బందిని శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా బరోసా కల్పించాలని అన్నారు. నేరాల నివారనే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి




చూపుతూ, స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. త్వరలో లోకల్ బాడీ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందును అధికారులు,సిబ్బంది సన్నద్ధంగా ఉండాలి పకడ్బంది గా పని చేయాలని, గ్రామాలలో జరిగే శాంతి భద్రతల అంశాలను ముందస్తు సంచారం సేకరించి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోవు రోజులో కురిసే వర్షాల దృష్ట్యా ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ప్రణాళికా బద్దంగా పని చేయాలని అన్నారు. వర్షాల ప్రభావం, వరద పరిస్థితిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్య పర్చాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకు యువతకు ప్రత్యేకంగా సైబర్ నేరాల నివారణ పై చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. పోలీస్ స్టేషన్ అధికారులు,సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అన్నారు. అనంతరం సిబ్బంది తో మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ అంతా పరిశుభ్రంగా గా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సిబ్బంది కి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమైనా ఉంటే తమ దృష్టి కి తీసుకొని రావాలి అని సూచించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటడం జరిగింది.ఈ కార్యక్రమంలో డిఎస్పి రాములు ,మెట్ పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ ,ఇబ్రహీంపట్నం ఎస్.ఐ అనిల్, ఎస్.ఐ లు శ్రీకాంత్, రాజు, నవీన్ రాజు నాయక్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు



**మెట్ పల్లి (మన వెలుగు) జులై 04 :**
జువ్వడి నర్సింగ్ రావు జన్మదిన వేడుకలు జువ్వడి భవన్ లో ఘనంగా నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెంట ప్రణయ్ తేజ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతి ఒక్క పేదవాడికి చేరే విధంగా ప్రజలం దరితో మమేకమై నేనున్నానంటూ భరోసా ఇస్తూ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి బలపరుస్తున్న ప్రజానా యకుడు పేదల పెన్నిధి, మన జువ్వడి నర్సింగ్ రావుఅని కొనియాడారు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని రాబోయే రోజుల్లో కూడా ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి ఆశీస్సులతో ఉన్నత పదవులు పొందాలని కోరుకుం టున్నాము అని అన్నారు, ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అమల రాహుల్ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు బర్ల వంశీ,ఎన్.ఎస్.యూ. ఐ పట్టణ అధ్యక్షుడు షేర్ భరత్, యూత్ కాంగ్రెస్ నాయకులు బర్ల సురేష్ పోల్కం శివ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు అబ్బ రాహుల్ నేత కిరణ్ పత్రి అజయ్ రాజేందర్ ప్రేమ్ సుమన్ తదితరులు పాల్గొన్నారు

# సర్కారు మోసాన్ని నిలదీస్తే సంకెళ్ళా...?

**- కాంగ్రెస్ ది జాబ్ క్యాలెండర్ కాదు జాబులెస్ క్యాలెండర్**
**- నిరుద్యోగులకు అండగా నిలుస్తాం, రేవంత్ సర్కారు ద్రోహాన్ని ఎండగడతాం**
**- బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 04**
ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నయవంచనకు పాల్పడిన కాంగ్రెస్ సర్కారు మోసాన్ని నిలదీసిన నిరుద్యోగుల చేతులకు సంకెళ్ళు వేస్తారా?బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు,ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి మండిపడ్డారు.
హామీలు అమలు చేయమన్న పాపానికి ఇంత నిర్బంధకాండను అమలు చేయడం నిరంకుశ ఇందిరమ్మరాజ్యంలో భాగమేనని, రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందని ఆయన శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు.
ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్




అధిష్టానం చేసిన ద్రోహంపై నిలదీసేందుకు వచ్చిన నిరుద్యోగులను అరెస్టు చేయడం అత్యంత హేయమైన చర్య అని జీవన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.తమ ప్రజాపాలనలో సెక్రటేరియట్ తలుపులు ఎప్పుడూ బార్లా తెరిచే ఉంటాయని ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నిరుద్యోగుల వెతలు కనిపించడం లేదా? అని ఆయన ప్రశ్నించారు.
బీ ఆర్ఎస్ హయాంలో 95శాతం ఉద్యోగాలు తెలంగాణ బిడ్డలకు దక్కేలా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ తీసుకున్న విషయాన్ని జీవన్ రెడ్డి గుర్తు చేశారు.
జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రభుత్వం ఏడాది లోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తామన్న హామీతో పాటు ప్రతినెల నిరుద్యోగులకు రూ.4000 చొప్పున నిరుద్యోగ భృతి, ఆడపడుచులకు రూ. 2500, 18 ఏళ్లు నిండిన విద్యార్థులకు ఎలక్ట్రికల్ స్కూటీలు ఇవ్వడం వంటి హామీలను ఎందుకు అమలు చేయలేదని ఆయన నిలదీశారు.విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించని కారణంగా విద్యార్థులు ఉత్తీర్ణులైనప్పటికీ వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కారణంగా విద్యార్థులు ఉన్నత చదువులకు,జాబులకు వెళ్లలేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామని చెప్పిన జాబు క్యాలెండర్ లో భాగంగా ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదని నిరుద్యోగులు రగిలిపోతున్నారని ఆయన చెప్పారు.కాంగ్రెస్ ది జాబ్ క్యాలెండర్ కాదు జాబులెస్ క్యాలెండర్,ఇది నిరుద్యోగులను నిలువునా ముంచిన దగాకోరు క్యాలెండర్ అని ఆయన నిప్పులు చెరిగారు.నిరుద్యోగ భృతికి కూడా గతి లేదని, పీజీలు పీహెచ్ డీలుచేసి ఉద్యోగాలు లేక ఆటోలు నడుపుకుంటున్న నిరుద్యోగుల వెతలు ప్రభుత్వానికి పట్టడం లేదని లే ఆయన నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే ఇద్దరు నిరుద్యోగులు చనిపోయారని పేర్కొంటూ ఇంకా ఎంతమంది చనిపోవాలని ఆయన నిలదీశారు.ఉద్యోగాల కోసం పోరాడుతున్న నిరుద్యోగ సోదరులకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని,రేవంత్ రెడ్డి సర్కారు ద్రోహాన్ని ఎండగడతామని జీవన్ రెడ్డి హెచ్చరించారు.

# 250 గ్రాముల గంజాయి పట్టుకున్న ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 04 :**
నిజామాబాద్ నగర శివారులోని దుబ్బ బైపాస్ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు పట్టుకున్నారు. నిజామాబాద్ ఎక్సైజ్ డిసీ సోమిరెడ్డి కి




అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ సిఐ వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం బైపాస్ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న రెంజల్ మండలం నీలా గ్రామానికి చెందిన పుల్లే లక్ష్మి నర్సింహ ను పట్టకున్నారు. అతని వద్ద నుంచి 250 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతనిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేష్ తెలిపారు. ఈ దాడులలో ఎస్ఐ నర్సింహచారీ, హెడ్ కానిస్టేబుళ్లు భూమన్న, రాజన్నలతో పాటు కానిస్టేబుళ్లు బోజన్న, విష్ణు,అవినాష్, సాయి కుమార్, రాం బచ్చన్ లు ఉన్నారు.

# ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా విలేకరులు

**పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి**

**హైదరాబాద్ సిటీ బ్యూరో (మన వెలుగు) జులై 04 :**
ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి లాంటి వారు పత్రిక విలేకరులని ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి అన్నారు. మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా ప్రెస్ క్లబ్ ఆవరణలో కమిటీ సభ్యులను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో శుక్రవారం నాడు సన్మానించడం జరిగింది... ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ ప్రజలకు మంచి వార్తలను అందించే విధంగా విలేకరులు పనిచేయాలని తమ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని అన్నారు. ప్రజా సమస్యలను ప్రతిబింబించేలా వారి మన్ననలు పొందాలని అన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిర్ర







శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ... మేడిపల్లి మండల పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు వచ్చే విధంగా ప్రజా పాలన ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ముఖ్య సలహాదారులు వి. సూర్యనారాయణ రెడ్డి,మాజీ అధ్యక్షుడు కల్మారి ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి వడ్డేమాను సుందర్, కోశాధికారి మరాటి మల్లేష్ ఉపాధ్యక్షులు సైరెడ్డి సాగర్ రెడ్డి,చింత రమేష్, కోఆర్డినేటర్ రావు నాగిరెడ్డి, సంయుక్త కార్యదర్శులు చిన్నం మధు, నీరుడు అంజన్ కుమార్, దాసరి దయాకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు బుషా గణేష్, బీతోజు భాస్కర్ చారీ, శేరి కరుణాకర్ రెడ్డి,మరాటి మత్స్యగిరి,జక్కు భగీరథరెడ్డి, జంగా నరేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ ఏఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి ఒకరి ప్రాణాలు కాపాడారు



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 04 :**
నిజామాబాద్ నగరంలోని కోర్ట్ సర్కిల్ నందు ఒక వృద్ధురాలు ఫిట్స్ వచ్చి రోడ్డుపై పడిపోగా అక్కడే ఉన్నటువంటి ట్రాఫిక్ ఏఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి సకాలంలో సహాయం చేసి, ఆసుపత్రికి తరలించి, మానవత్వాన్ని చాటుకున్నారు.వృద్ధురాలికి సపరియాలు చేసి వెంటనే గవర్నమెంట్ హాస్పిటల్ కు పంపినాడు.మానవత్వం చాటుకున్న శ్రీనివాస్ రెడ్డిని స్థానికులు అభినందించినారు.

# ఏజెన్సీ ప్రాంతానికి బస్సు సౌకర్యం కల్పించాలి




**పినపాక (మన వెలుగు) జులై 04 :**
అశ్వాపురం : మండల పరిధిలోని మొండికుంట మీదుగా కురాపెల్లి కొత్తూరు, తుమ్మలచెరువు, వెంకటాపురం, మామిండ్లవాయి, రామవరం, గొందిగూడెం దాదాపుగా 20 ఏజెన్సీ గ్రామాల ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు ఈ గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలతో పాటు, విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బస్సులు లేక విద్యార్థులు ఉన్నత విద్యకు స్వస్తి పలుకుతున్నారని బస్సులు లేక అధిక చార్జీలు పెట్టి ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం చేయాల్సి వస్తుందని బస్సుల సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ గిరిజన గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరగాలి

**- వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై సమీక్షలో కలెక్టర్ వెల్లడి**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 04**
ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగేలా అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి వైద్యాధికారులకు సూచించారు. ఈ విషయమై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పనితీరులో స్పష్టమైన మార్పు రావాల్సిందేనని స్పష్టం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో శుక్రవారం జిల్లా వైద్యారోగ్య శాఖ పనితీరుపై కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష జరిపారు. పీ.హెచ్.సీలు, సీ.హెచ్.సీలు,. హెల్త్ సబ్ సెంటర్ల వారీగా వాటి పనితీరును సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇదివరకటితో పోలిస్తే ప్రసవాల రేటు క్రమేణా తగ్గుతూ వస్తోందని అన్నారు.గర్భిణీ మహిళల వివరాల నమోదు పూర్తి స్థాయిలో జరగాలని, వారికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా ఇటీవలి కాలంలో సిజేరియన్ ఆపరేషన్లు ఎక్కువగా జరుగుతున్నట్లు గణాంకాల ద్వారా వెల్లడి అవుతోందని, అత్యవసరం అయితే తప్ప సిజేరియన్ చేయకూడదని, మహిళల దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా సాధారణ ప్రసవాల కోసం పూర్తి స్థాయిలో కృషి. చేయాలని హితవు పలికారు. ప్రభుత్వ



ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులు చేస్తారని, మెరుగైన వైద్యం అందుతుందని ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా సంతృప్తికర సేవలు అందించాలని అన్నారు. సి.సెక్షన్ లు ఎక్కువగా జరుగుతున్న ప్రైవేటు నర్సింగ్ హోమ్ లు, ఆసుపత్రుల పై కూడా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రసవాలు అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరిగేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్యాధికారులు, ఆయా విభాగాల సిబ్బంది సమిష్టిగా, సమన్వయంతో పనిచేస్తూ సత్ఫలితాలు సాధించాలని సూచించారు. క్రమం తప్పకుండా తాను ప్రగతిని సమీక్షిస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యాక్సినేషన్ నూటికి నూరు శాతం జరగాలని, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా విధులు నిర్వర్తిస్తూ, పనితీరు మెరుగు పరచుకోవాలని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. కాగా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్ల నూతన భవన నిర్మాణాల స్థితిగతులు, పనుల పురోగతి, వైద్యులు, సిబ్బంది ఖాళీలు, సమకూర్చాల్సిన సదుపాయాలపై కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు. సమీక్షలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ,
వివిధ విభాగాల వైద్యాధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా దొడ్డి కొమురయ్య కురుమ 79వ వర్ధంతి వేడుకలు

**వేడుకలో పాల్గొన్న కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు గొరిగె నర్సింహా కురుమ**

హైదరాబాద్ సిటీ బ్యూరో (మన వెలుగు) జులై 04 :



కురుమ యువ చైతన్య సమితి మేడిపల్లి మండలం అధ్యక్షులు మరాఠి శివేందర్ కురుమ ఆధ్వర్యంలో తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ 79వ వర్ధంతి ఉప్పల్ డిపో వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు గొరిగె నర్సింహా కురుమ,మాజీ కార్పొరేటర్ కొడే పోచయ్య కురుమ ముఖ్య అతిథిలుగా పాల్గొని దొడ్డి కొమురయ్య కురుమ మరణించి 79 సంత్సరాలు అయిన తగిన గుర్తింపు దక్కలేదు అన్నారు. గత సంవత్సరం వర్ధంతి సభలో మంత్రి వెంకట్ రెడ్డి వచ్చే వర్ధంతి వరకు హైద్రాబాద్ లో విగ్రహం ఏర్పాటు చేస్తాము అన్నారు. ఇప్పటి వరకూ మొదలు పెట్టలేదు ఎప్పటికైనా ట్యాంక్ బండ్ పై విగ్రహం ఏర్పాటు చెయ్యాలి జనగామ జిల్లాకు దొడ్డి కొమురయ్య కురుమ పేరు పెట్టాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవైసీస్ న్యాయ సలహాదారులు నోముల ప్రసన్న కుమార్ కురుమ, రాష్ట్ర కార్యదర్శి కెమిడి సత్యనారాయణ కురుమ, మేడిపల్లి మండల జనరల్ సెక్రెటరీ ఓరిగంటి భాస్కర్, కోశాధికారి చిందం రాజు, ఉపాధ్యక్షుడు మరాటి వెంకటేష్, గణేష్ నగర్ అధ్యక్షులు సోమలింగం, చెంగిచెర్ల అధ్యక్షులు పర్వతాలు, చండీశ్వర కురుమ సంఘం అధ్యక్షులు జోగు సోమయ్య, పార్వతి నగర్ అధ్యక్షులు జోగు సోమేష్, మల్లికార్జున నగర్ అధ్యక్షులు కర్రే శ్రీనివాస్, కేవైసీస్ చెంగిచెర్ల అధ్యక్షులు కడకంచి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సభకు భారీగా తరలిన పీర్జాదిగూడ కాంగ్రెస్ శ్రేణులు

**జెండా ఊపి బస్సులని ప్రారంభించిన వజ్రెష్ యాదవ్, సుదీర్ రెడ్డి, మాజీ మేయర్ అమర్ సింగ్, తుంగతుర్తి రవి**
**జై బాపు - జై భీం - జై సంవిధాన్ బహిరంగ సభ సూపర్ సక్సెస్**
**సభను విజయవంతం చేసిన కాంగ్రెస్ శ్రేణులకు తుంగతుర్తి రవి కృతజ్ఞతలు**

హైదరాబాద్ సిటీ బ్యూరో (మన వెలుగు) జులై 04 :



రాజ్యాంగ స్ఫూర్తిని మేల్కొలిపే ఉద్దేశంతో,భారత రాజ్యాంగ విలువలను గర్వంగా చాటి చెప్పే విధంగా టీపీసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్న "జై బాపు – జై భీం – జై సంవిధాన్" సభకు ముఖ్యఅతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే పాల్గొంటున్న ఈ సభకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీగా బయలుదేరాయి. ఈ సందర్భంగా పీర్జాదిగూడ కార్పొరేషన్ నుండి కాంగ్రెస్ సభకు బయలుదేరి బస్సులను జెండా ఊపి బస్సులని ప్రారంభించిన వజ్రెష్ యాదవ్, సుదీర్ రెడ్డి, మాజీ మేయర్ అమర్ సింగ్, అధ్యక్షులు తుంగతుర్తి రవి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎల్బీ స్టేడియం లో జరిగిన బహిరంగ సభను విజయవంతం చేయటానికి కృషి చేసిన పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులకు,పార్టీ నాయకులకు కార్యకర్తలకు తుంగతుర్తి రవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు .

ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్లు,వార్డు ఇంచార్జులు,మహిళా అధ్యక్షురాలు,మహిళా కాంగ్రెస్ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు,సేవాదళ్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# ఒలంపియాడ్ 2024-25 సంవత్సరానికి బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డు

మెట్ పల్లి (మన వెలుగు) జులై 04 :



వినాయక్ నగర్ సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల ఐ టి ఓ ఇండియన్ టాలెంటెడ్ ఒలంపియాడ్ 2024-25 సంవత్సరానికి బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డు ముంబాయి వారిచే శ్రీ వి బి మహర్షి గారు స్వీకరించిన సందర్భంగా వినాయక నగర్ సొసైటీ అధ్యక్ష కార్యవర్గం సభ్యులు నిఖిల్ భరత్ కాన్వెంట్ హై స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీ వి బి మహర్షి గారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు తోట ప్రవీణ్ ఉపాధ్యక్షులు సాంబారి శ్రీనివాస్ సెక్రెటరీ గిరి తోట ప్రసాద్ భోగ మురళి మారుతి పత్రి శంకర్ కోరే రమేష్ గంగారెడ్డి నారాయణ శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరులు దొడ్డి కొమురయ్య

నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జులై 04 :




సిపిఐ జిల్లా కార్యాలయంలో దొడ్డి కొమురయ్య 79 వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్,నగర కార్యదర్శి వై.ఓమయ్య లు మాట్లాడుతూ నైజాం కాలంలో భూమి కోసం, భుక్తి కోసం, మాతృభూమి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట మొదటి అమరులు దొడ్డి కొమరయ్య అని అన్నారు ఆయన త్యాగ ఫలితమే ఆనాడు గ్రామ,గ్రామాన సంఘం ఏర్పడి నైజాం దోపిడి విధానాలపై, పేదలపై రజాకార్లు చేస్తున్న ఆగడాలకు వ్యతిరేకంగా, మరియు పెత్తందారులు, భూస్వాములపై ప్రజలు తిరగబడ్డారని ఆ పోరాటం మూలంగానే నాటి హైదరాబాద్ తెలంగాణ ప్రాంతం భారతదేశంలో సెప్టెంబర్ 17న విలీనం కాపడ్డదని తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు పి.రంజిత్ మరియు రాధా కుమార్, సక్కి సురేష్ పాల్గొన్నారు

# ప్రజా సంక్షేమమే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యం,,

**- ప్రతి ఇంటికి సంక్షేమ కార్యక్రమాలు అందించారు**
**- పండగ వాతావరణం లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం**
**- ఉదయగిరి పట్టణంలోని దిలావర్ భాయ్ వీధిలో ఇంటింటి ప్రచారం చేపట్టిన ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గార్లు**
**- టీ షాప్ లో టీ తాగి యోగక్షేమాలు తెలుసుకున్న నేతలు**
**- కూటమి ప్రభుత్వ సంక్షేమాన్ని వివరించిన ఎంపీ, ఎమ్మెల్యే**





ప్రజా సంక్షేమ ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు అన్నారు గురువారం సాయంత్రం ఉదయగిరి పట్టణంలోని దిలావర్ భాయ్ వీధిలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గారితో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి టిడిపి ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. వారికి ప్రభుత్వంలో పొందిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు పొందిన వృద్ధులను, తల్లికి వందనం పడిన మహిళలను వారు పలకరించారు. ఏడాది కాలంలో సాధించిన ప్రగతిపై కరపత్రం అందించారు. పలువురు విద్యుత్ సమస్య, ఇంటి సమస్యలు ప్రస్తావించగా.. వెంటనే నోట్ చేసుకుని పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు మీడియాతో మాట్లాడుతూ... సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికి టిడిపి కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికలపుడు ఇంటింటి ప్రచారం సాధారణమని కానీ ఎలక్షన్లు పూర్తయి గెలిచిన ఏడాది తర్వాత మళ్లీ ప్రజల్లోకి వెళ్లడం సాధారణ విషయం కాదన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం వల్లే ఈరోజు ఇంటింటి ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. దీని ద్వారా స్థానికంగా ప్రజలు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా తెలుస్తాయన్నారు. కూటమి ప్రభుత్వం ద్వారా ఎన్నో కుటుంబాలలో వెలుగులు నిండాయని ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అంతమందికి తల్లికి వందనం కింద 15000 అందించారన్నారు. దేశంలోనే అత్యధికంగా నాలుగు వేలు పెన్షన్ ఇస్తూ వృద్ధులను వితంతువులను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు రహదారి సమస్యను ప్రస్తావించగా ఎంపీ లాడ్స్ కింద నిధులు మంజూరు చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గారు మాట్లాడుతూ.. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం కింద ఇంటింటి ప్రచారం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని పథకాలను అమలు చేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు గారికి ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలన్నారు. తల్లికి వందనం కింద ప్రతి ఒక్కరికి రైతులకు 20,000 అందించే అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయనున్నారన్నారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు ఇస్తున్నామని, సీఎం చంద్రబాబు నాయుడు గారు, రాబోయే రోజుల్లో యువతకి 20 లక్షల మందికి ఉద్యోగాలు అవకాశాలు కల్పిస్తారన్నారు. లోకేష్ గారు పలు పెద్ద పెద్ద కంపెనీలు తెస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు.

ఇంటింటి ప్రచారంలో భాగంగా దిలావర్ భాయ్ వీధిలో ఉన్న చెక్క నగిసి కేంద్రాన్ని ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే సురేష్ గారు ప్రత్యేకంగా సందర్శించారు. ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ తో, అందులో పనిచేస్తున్న మహిళలతో ప్రత్యేకంగా మాట్లాడారు. వారు చేస్తున్న కళాకృతులను పరిశీలించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ ప్రస్తావించిన పలు సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో.. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి పి. చెంచల బాబు యాదవ్, కేతంరెడ్డి వినోద్ రెడ్డి, మండల కన్వీనర్ బయన్న, మైనార్టీ నాయకుడు రియాజ్, నాయకులు బొజ్జ నరసింహులు, శ్రీనివాసులు, పాముల రమణయ్య, నల్లి పోగు రాజా, ఓబుల్ రెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, గడ్డం శ్రీనివాసులు, తుమ్మల కిరణ్, సందాని తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినరోజున గురువుల ఆశీర్వాదం తీసుకున్న శ్రీశైలం యాదవ్



ఎం.ఆర్.సి శ్రీశైలం యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా తనకు విద్యను బోధించిన గురువులు శుక్రవారం పరిగి లోని రిటర్మెంట్ కార్యాలయంలో జన్మదిన సందర్భంగా జ్ఞాపికను ఇచ్చి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. గురువులు నారాయణ రావు, నవాజ్ రెడ్డి, చెన్నారెడ్డి, శివలింగం,రాంగచారి పాల్గొన్నారు.

# భారీ బహిరంగ సభకు బయలుదేరిన పరిగి కాంగ్రెస్ పార్టీ నాయకులు



లాల్ బహదూర్ స్టేడియంలో జరిగే సభకు బయలుదేరిన పరిగి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల సభకి పరిగి ఎమ్మెల్యే డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పరిగి నియోజక వర్గంలోని అని మండలాల నుండి హైదరాబాద్ ఎల్బీ స్టేడియం సమావేశం కు బయలుదేరిన కాంగ్రెస్ పార్టీ గ్రామ,మండల,జిల్లా స్థాయి నాయకులు. డిసిసి ఉపాధ్యక్షులు లాల్ కృష్ణ ,మార్కెట్ కమిటీ చైర్మన్ భూమున్న గారి పరశురాంరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్, పరిగి పట్టణ అధ్యక్షులు ఎర్రగడ్డ పల్లి కృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కుడుముల యాదయ్య, గణమోని శ్రీనివాస్, రాపోల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గండు వెంకటేష్, ఉపాధ్యక్షులు రాకేష్, రాజా పుల్లారెడ్డి, చిన్న నరసింహులు, జగన్ ,వెంకటేష్, రామకృష్ణారెడ్డి ,రాధారావు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభ సభ్యులు లక్ష్మన్ ను మర్యాదపూర్వం కలిసిన పరిగి అసెంబ్లీ ఇంచార్జ్ మారుతి కిరణ్ బూనేటి



భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు పార్లమెంట్ బోర్డ్ సభ్యులు రాజ్యసభ సభ్యులు డాక్టర్. కె. లక్ష్మణ్ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి పరిగి అసెంబ్లీ ఇంచార్జ్ మారుతీ కిరణ్ బూనేటి.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
**వావిలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన**





ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేస్తున్నామని పటాన్ చెరు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని వావిలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మోల్డ్ టెక్ కంపెనీ సహకారంతో బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న రెండు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద, మధ్య తరగతి విద్యార్థులు అత్యధికంగా విద్యను అభ్యసించే. ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యతోపాటు క్రీడారంగంపై ఆసక్తి పెంపొందించేలా ప్రతి పాఠశాలలో మైదానాలను ఏర్పాటు చేస్తూ వివిధ క్రీడలకు సంబంధించిన కోర్టులు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై వేలాది రూపాయలు ఖర్చు చేస్తోందని.. జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్న లక్ష్యంతో చదువుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, బాల వికాస్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరి రెడ్డి, గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, నవనీత్ రెడ్డి, రవీందర్, పరిశ్రమ ప్రతినిధులు, స్థానిక నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు..

# మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

మత సామరస్యానికి, త్యాగనిరతికి మొహర్రం పర్వదినం ప్రతీకగా నిలుస్తుందని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మొహర్రం సందర్భంగా ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి ఆధ్వర్యంలో పటాన్ చెరు పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా శుక్రవారం సాయంత్రం షర్బత్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో హిందూ ముస్లిం సోదరులు కలిసి నిర్వహించుకునే పండుగ మొహర్రం అన్నారు. ధర్మ పరిరక్షణ, శాంతియుత సమాజ స్థాపన కోసం మహమ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన ప్రాణత్యాగం నుంచి నేటి సమాజం తెలుసుకోవాల్సింది ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అఫ్జల్, వెంకటేష్, షకీల్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

